క్లుప్తంగా

బాల్యదశ ప్రేరణలతో వ్యక్తిత్వ వికాసం

● సీడీపీఓ రాజ్యలక్ష్మి



మాట్లాడుతున్న సీడీపీఓ రాజ్యలక్ష్మి

బాడంగి: మనిషి వ్యక్తిత్వ వికాసానికి బాల్యదశలో జరిగే ప్రేరణలే ఆధారమని సీడీపీఓ కె.రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని రామచంద్రాపురం అంగన్‌వాడీ కేంద్రంలో జన్ భాగీదారీపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పిల్లల సమగ్రాభివృద్ధికి అంగన్‌వాడీ కేంద్రాలు ఉపయోగపడతాయని చెప్పారు. డిపార్ట్‌మెంట్ సరఫరా చేసిన పీపీ–1, 2 వర్క్, ఏక్టివిటీ బుక్స్, స్పోకెన్ ఇంగ్లిష్ చిన్నారులకు బోధించాలని సూచించారు. కార్యక్రమంలో ఆమెతో పాటు సూపర్‌వైజర్ నాగమణి, కార్యకర్తలు భవానీ, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.

గురుకులంలో వెంటనే చేరాలి

బాడంగి: స్థానిక అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలల్లో ఆంగ్ల మాధ్యమంలో చేరేందుకు ఎంపికైన విద్యార్థులు వెంటనే చేరాలని ప్రిన్సిపాల్ టి. రామదాసు కోరారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన మాట్లాడుతూ, గతంలో జరిగిన ఐదో తరగతి, ఇంటర్ ఫస్టియర్ ప్రవేశ పరీక్షలలో సెలక్టయి ఈ పాఠశాలకు కేటాయించిన 160 మంది విద్యార్థుల్లో సగం మంది ఇంకా చేరలేదని చెప్పారు. అలాగే స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల పాఠశాలలో ఆరు, ఇంటర్‌లో ఇంకా ఖాళీలున్నట్లు ప్రిన్సిపాల్ నజియా తెలిపారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కూడా ఖాళీలున్నట్లు ప్రిన్సిపాల్ వి. శంకరరావు తెలిపారు. పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి కూడా అవకాశం ఉంటుందని తెలిపారు.

ఎస్‌డబ్ల్యూపీసీ పనులు ప్రారంభించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ

తెర్లాం: మండలంలో పలు గ్రామ పంచాయతీల్లో చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాల (ఎస్‌డబ్ల్యూపీసీ) పనులు త్వరితగతిన ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పలు గ్రామాల సర్పంచ్‌లు, ఉపాధి హామీ పథకం సాంకేతిక సహాయకులతో ఎస్‌డబ్ల్యూపీసీ నిర్మాణాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ, మండల పరిధిలోని పలు గ్రామాల్లో కేంద్రాలు నిర్మించేందుకు స్థలాలు లేకపోవడంతో రెవెన్యూ అధికారులకు స్థలాలు కేటాయించాల్సిందిగా కోరామన్నారు. సమావేశంలో పలువురు సర్పంచ్‌లు, ఉపాధి సాంకేతిక సహాయకులు పాల్గొన్నారు.


అసంఘటిత కార్మికులకు సమగ్రచట్టం



రిక్షా కార్మికులతో కలిసి మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామ్మూర్తినాయుడు

రాజాం సిటీ: రాష్ట్ర ప్రభుత్వం అసంఘటిత రంగ కార్మికుల కోసం సమగ్రమైన చట్టం చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి సీహెచ్ రామ్మూర్తినాయుడు కోరారు. స్థానిక పట్టణంలో రిక్షా వర్కర్స్ యూనియన్ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేతినిండా పనిలేని రిక్షా కార్మికులకు ఆర్థిక సహాయం అందించడంతో పాటు వారి జీవనోపాధికి ఆటోరిక్షాలు అందజేయాన్నారు. బడ్జెట్‌లో కార్మికుల సంక్షేమానికి అవసరమైన నిధులు కేటాయించాలని, న్యాయమైన కోర్కెల సాధనకు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సింహాద్రినాయుడు, సూరి, నారాయణ, సాంబయ్య, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపు



ఆక్రమణలు తొలగిస్తున్న దృశ్యం

బొబ్బిలి: పట్టణంలోని టీటీడీ కల్యాణ మంటపం ఎదురుగా ఉన్న రహదారిలో రోడ్డుకిరువైపులా ఉన్న ఆక్రమణలను మున్సిపల్ అధికారులు తొలగించారు. ముందుగా గురువారం విద్యుత్ కనెక్షన్లను తొలగించిన అధికారులు శుక్రవారం బడ్డీలను తొలగించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు తొలగింపులు చేపట్టామని టౌన్‌ప్లానింగ్ ఆఫీసర్ ఓ. వరప్రసాదరావు తెలిపారు.

ప్రభుత్వ పథకాలే ప్రజలకు శ్రీరామరక్ష

● 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే కంబాల జోగులు



సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందజేస్తున్న ఎమ్మెల్యే కంబాల జోగులు

సంతకవిటి: రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలే ప్రజలకు శ్రీరామరక్ష అని ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా మండలంలోని ముకుందపురం గ్రామంలో శుక్రవారం పర్యటించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన నాలుగేళ్లుగా ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, అమలు చేస్తున్న పథకాలను వివరించారు. ఏవైనా సమస్యలున్నా, అర్హులై ఉండి ఎవరికైనా పథకాలు అందకపోయినా వెంటనే తెలియజేయాలన్నారు. ఈ క్రమంలో పలువురు ఆయన దృష్టికి తీసుకువచ్చిన చిన్నచిన్న సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్సార్ సీపీ అని ప్రశంసించారు. ఇప్పటివరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరిగిందన్న దాఖలాలు లేవన్నారు.

ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు. రాష్ట్ర సమగ్రాభివృద్ధి, ప్రజాసంక్షేమమే పరమావధిగా అహర్నిశలు శ్రమిస్తున్న సీఎం జగనన్నను వచ్చే ఎన్నికల్లోనూ ముఖ్యమంత్రిని చేయాలని ఎమ్మెల్యే కోరారు. టీడీపీని గెలిపిస్తే ఇప్పుడున్న సంక్షేమ పథకాలు ఏవీ ఉండవన్నారు. ఇదే సంక్షేమ పాలన కొనసాగాలంటే వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్ని మళ్లీ అధికారంలోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఎస్. జగన్ మోహనరావు, సర్పంచ్ ఆర్.స్వామినాయుడు, ఎంపీటీసీ కె.సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

రూ. 256.71 కోట్లతో అభివృద్ధి పనులు



అభివృద్ధి పనుల పురోగతిని ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావుకు వివరిస్తున్న డీఈఈలు అప్పారావు, రమణ మోహన్

రామభద్రపురం: పల్లెల్లో ప్రగతి పరుగులు పెడుతోందని, ఈ నాలుగేళ్లలో నియోజకవర్గంలో 256.71 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేపడుతున్నామని పంచాయతీ రాజ్, ప్రాజెక్ట్ డీఈఈలు అప్పారావు, రమణమోహన్ అన్నారు. శుక్రవారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో వారు ఎంపీపీ చొక్కాపు లక్ష్మణరావును కలిశారు. ఈ సందర్భంగా ఎంపీపీ అభివృద్ధి పనుల పురోగతిపై ఆరా తీశారు. దీంతో అధికారులు స్పందిస్తూ, నియోజకవర్గంలో గ్రామ సచివాలయాలు, ఆర్బీకేలు, వెల్‌నెస్ సెంటర్లు, తదితర భవన నిర్మాణాల వంటి 383 పనులు జరుగుతున్నాయన్నారు. అలాగే 288.97 కి.మీ మేర సీసీ, బీటీ రోడ్లు, కాలువల నిర్మాణాలు జరుగుతున్నాయని చెప్పారు. ఇప్పటివరకు 133 పనులు, 120.40 కిలోమీటర్ల మేర రోడ్లు, కాలువల నిర్మాణాలు జరగాయన్నారు. ఉపాధిహామీ నిధులు రూ.149.89 కోట్లు, ప్రధానమంత్రి సడక్ యోజన నిధులు రూ.16.15 కోట్లు, ఏపీఆర్‌ఆర్‌పీ నిధులు రూ.73.07 కోట్లు, ఏఎంసీ నిధులు రూ.12.30 కోట్లు, గడప గడపకు మన ప్రభుత్వం నిధులు రూ. 3.67 కోట్లు, జిల్లా పరిషత్ జనరల్ ఫండ్ నిధులు రూ.1.22 కోట్లు, ఎంపీ ల్యాడ్ నిధులు రూ.39.74 లక్షలతో వివిధ అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో ప్రాజెక్ట్ ఏఈఈ రుక్మాంగంధరనాయుడు, తదితరులు పాల్గొన్నారు.

శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి



జనవిజ్ఞాన వేదిక పోస్టర్ ఆవిష్కరిస్తున్న సభ్యులు

రాజాం సిటీ: ప్రతి ఒక్కరూ శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలని జనవిజ్ఞాన వేదిక(జేవీవీ) జిల్లా ప్రధాన కార్యదర్శి పి.రమణప్రభాత్ తెలిపారు. స్థానిక విద్యానికేతన్ స్కూల్ ఆవరణలో జనవిజ్ఞాన వేదిక ప్రాంతీయ సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్రీయ సమాజ నిర్మాణానికి అందరూ కృషి చేయాలని, జేవీవీలో సభ్యులుగా చేరాలన్నారు. విజ్ఞాన శాస్త్రం ఆవశ్యకతతో పాటు సమాజంపై దాని ప్రభావాన్ని ప్రజలకు తెలియజేయాలన్నారు. అనంతరం జనవిజ్ఞాన వేదిక సభ్యత్వ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జేవీవీ సభ్యులు జె.నీలయ్య, ఎస్.సత్యనారాయణ, పి.గౌరీశ్వరరావు, జి.చంద్రశేఖర్‌నాయుడు, ఎ.వెంకటినాయుడు, కె.సాయిప్రశాంత్‌కుమార్, పి.చైతన్యకుమార్, పి.వేణుగోపాల్, సంతకవిటి, రాజాం, రేగిడి, వంగర, జి.సిగడాం సైన్స్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత 'గురవాం'



ట్రోఫీతో విజేత జట్టు

రాజాం సిటీ: మండలంలోని గురవాం గ్రామంలో అల్తి లక్ష్మణరావు జ్ఞాపకార్థం గత కొన్నిరోజులుగా నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ముగిశాయి. శుక్రవారం సాయంత్రం గురవాం, లచ్చన్నవలస జట్ల మధ్య జరిగిన ఫైనల్ మ్యాచ్ హోరాహోరీగా సాగింది. చివరకు గురవాం జట్టు విజేతగా నిలిచి, ట్రోఫీ కైవసం చేసుకుంది. లచ్చన్నవలస జట్టు తొలుత టాస్ గెలిచి, బౌలింగ్ ఎంచుకోగా, బ్యాటింగ్‌కు దిగిన గురవాం జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 75 పరుగులు చేసింది. అనంతరం 76 పరుగుల విజయలక్ష్యంతో బ్యాటింగ్‌కు దిగిన లచ్చన్నవలస జట్టు 12 ఓవర్లకు 53 పరుగులు మాత్రమే చేసి, ఓటమి పాలైంది.

'జగనన్న విద్యాకానుక'ల పంపిణీ

బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో జగనన్న విద్యాకానుక(జేవీకే) కిట్ల పంపిణీ శుక్రవారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరైన ప్రజాప్రతినిధులు, అధికారుల చేతులమీదుగా వాటిని విద్యార్థులకు అందజేశారు. విద్యాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందన్నారు. ఏటా జేవీకే పథకం ద్వారా రూ.2,500 విలువైన కిట్(ఓ స్కూల్ బ్యాగు, పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, 3 జతల యూనిఫాం, బూట్లు, రెండు జతల సాక్సులు)ను విద్యార్థులకు అందించడం జరుగుతోందన్నారు. ప్రభుత్వ సదుపాయాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని, ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

– సాక్షి నెట్‌వర్క్



రాజాం: ఆగూరులో జేవీకే కిట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ అప్పారావు, హెచ్‌ఎం దాలినాయుడు



రేగిడి: చిన్నిశిర్లాంలో జగనన్న విద్యాకానుకలు అందజేస్తున్న వైస్ ఎంపీపీ అచ్చెన్నాయుడు, ఎంఈఓ ప్రసాదరావు



రాజాం సిటీ: లక్ష్మీపురం పాఠశాలలో విద్యార్థులకు జేవీకే కిట్లు అందజేత

రుచికరంగా 'జగనన్న గోరుముద్ద'



జగనన్న గోరుముద్ద పథకం అమలును పరిశీలిస్తున్న ఎంఈఓ ప్రసాదరావు

రేగిడి:

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందిస్తున్న జగనన్న గోరుముద్ద రుచికరంగా ఉండాలని ఎంఈఓ ఎంవీ ప్రసాదరావు వంట నిర్వాహకులకు సూచించారు. శుక్రవారం మండలంలోని రేగిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం కోసం వండిన వంటకాలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు వండిపెట్టాలని తెలిపారు. రోజులో విద్యార్థుల తల్లిదండ్రుల్లో ఎవరో ఒకరు భోజనం చేసి, భోజనం రుచి, నాణ్యతపై వారి అభిప్రాయం సేకరించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సత్కారం గౌరవ సంప్రదాయం

బొబ్బిలి: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను, వారి తల్లిదండ్రులను, ఉపాధ్యాయులను గౌరవించడం గౌరవమైన సంప్రదాయమని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు శంబంగి వేణుగోపాల నాయుడు అన్నారు. మండలంలోని పక్కి జెడ్పీ ఉన్నత పాఠశాలలో జగనన్న ఆణిముత్యాలకు శుక్రవారం పురస్కారాలను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వేణుగోపాల నాయుడు మాట్లాడుతూ, విద్యారంగంలో సంస్కరణలు తీసుకువచ్చిన ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ రుణపడి ఉండాలన్నారు. కార్యక్రమంలో పీఎంసీ చైర్మన్ బంకురు శంకరరావు, ఆర్‌వీజేఎస్ రాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ప్రశాంతత

రేగిడి: యోగా చేయడం ద్వారా మానసిక ప్రశాంతత లభిస్తుందని ఖండ్యాం ప్రభుత్వ ఆయుర్వేద వైద్యాధికారి ఎం.సునీల్‌కుమార్, యోగా ఇన్‌స్ట్రక్టర్ రామకృష్ణ తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా మండలంలోని ఖండ్యాం గ్రామంలో యోగా–దానివల్ల కలిగే ప్రయోజనాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించి, యోగా చేయండి.. ఆరోగ్యం కాపాడుకోండి అని నినాదాలు చేశారు. ఈ నెల 21వ తేదీన అందరూ అంతర్జాతీయ యోగా దినోత్సవం జరుపుకోవాలని కోరారు.

వైఎస్సార్ పశుబీమాను సద్వినియోగం చేసుకోండి



డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ నీలయ్య

బొబ్బిలి: నూతన పాలసీలతో వచ్చిన వైఎస్సార్ పశుబీమాను పాడి, తదితర రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని పశు సంవర్థక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ నీలయ్య అన్నారు. శుక్రవారం స్థానిక ఉప సంయుక్త సంచాలకుని కార్యాలయంలో ఆర్‌బీకేల్లోని సహాయకులు, పశువైద్యాధికారులతో సమావేశం నిర్వహించి వారికి లక్ష్యాలను విధించారు. ఈ సందర్భంగా పాడి ఆవులు, ఎద్దులు, గొర్రెలు, మేకలకు వర్తించే వివిధ పాలసీలను వివరించారు. కార్యక్రమంలో సహాయ సంచాలకుడు డాక్టర్ ఎల్. విష్ణు, పశువైద్యాధికారులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళల ఆందోళన



బ్యాంక్ ఎదురుగా నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

బొబ్బిలి: మండలంలోని పిరిడి విశాఖ గ్రామీణ బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ ఆసరా డబ్బులు చెల్లించడం లేదని ఆరోపిస్తూ డ్వాక్రా మహిళలు శుక్రవారం ఆందోళన చేపట్టారు. దాదాపు 115 సంఘాలకు రూ. 80 లక్షల ఆసరా డబ్బులు జమయ్యాయని, వాటిని సభ్యులకు చెల్లించడం లేదని మహిళలు ఆరోపించారు. అయితే తాను సెలవులో ఉన్నందున డబ్బులు విత్‌డ్రా చేయలేకపోయామని, విధుల్లో చేరిన వెంటనే డబ్బులు చెల్లించేలా చర్యలు తీసుకుంటానని మేనేజర్ విలేకరుకు తెలిపారు.

కళా ప్రాంగణం నిర్మాణానికి భూమిపూజ



భూమిపూజ చేస్తున్న పార్టీ పట్టణ కన్వీనర్ శ్రీనివాసరావు

రాజాం: స్థానిక పట్టణంలోని కళాకారుల కోసం సెయింట్ ఆన్స్ స్కూల్ సమీపంలో కళాప్రాంగణం నిర్మాణానికి పార్టీ పట్టణ కన్వీనర్ పాలవలస శ్రీనివాసరావు శుక్రవారం భూమిపూజ చేశారు. కళాప్రాంగణంతో పాటు మినీహాలు నిర్మాణానికి విజయనగరం ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ రూ.10 లక్షల నిధులు మంజూరు చేశారని ఆయన తెలిపారు. నిర్మాణాలకు జీఎంఆర్‌వీఎఫ్ సంస్థ ఉచితంగా స్థలాన్ని కేటాయించిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో కళాకారుడు యడ్ల గోపాలరావు తదితరులు పాల్గొన్నారు.

యోగాసనాల పోటీలు రేపు

బొబ్బిలి: ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా ఈనెల 18న టీటీడీ కల్యాణ మంటపం వద్ద గల శ్రీ యోగా విద్యాసంస్థలో ఉదయం 8 గంటలకు యోగాసనాల పోటీలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.మరిన్ని వివరాలకు 99662 29011, 70139 69066 నంబర్లను సంప్రదించాలని కోరారు.

'నాడు - నేడు' పనులు వేగవంతం



నాడు - నేడు పనులపై సమీక్షిస్తున్న ఎంఈఓ త్రినాథరావు

తెర్లాం: మనబడి నాడు – నేడు పథకం కింద మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో జరుగుతున్న పనులు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఎంఈఓ జె.త్రినాథరావు అన్నారు. శుక్రవారం స్థానిక ఎంఈఓ కార్యాలయంలో నాడు – నేడు పనులపై హెచ్‌ఎంలు, ఎస్ఎస్ఏ ఏఈ, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ, మండలంలో జరుగుతున్న అదనపు తరగతి గదులు మినహా మిగిలిన అన్ని కాంపొనెంట్ పనులు సకాలంలో పూర్తి చేయాలన్నారు. పలు పాఠశాలల్లో పనులు చేయగా మిగిలిన నిధులను అవసరమైన పాఠశాలలకు సర్దుబాటు చేస్తున్నట్లు చెప్పారు. పనుల్లో ఎటువంటి అవకతవకలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఎస్ఎస్ఏ ఏఈ ఎన్.రవికుమార్‌కు సూచించారు.

గడువులోగా ఇళ్ల నిర్మాణాలు

● ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ



హౌసింగ్ సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ

తెర్లాం: మండలంలోని 21 గ్రామ సచివాలయాల పరిధిలోని 33 గ్రామ పంచాయతీల్లో నవరత్నాలు – పేదలందరికీ ఇళ్లు పథకం కింద మంజూరైన ఇళ్ల నిర్మాణాలన్నింటినీ లబ్ధిదారులు త్వరితగతిన పూర్తిచేలా అవగాహన కల్పించాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ అన్నారు. శుక్రవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ సచివాలయాల వారీగా ఇళ్ల నిర్మాణాలపై సమీక్ష జరిపారు. ఏయే సచివాలయం పరిధిలో ఎన్ని ఇళ్లు మంజూరయ్యాయి.. ఎన్ని పూర్తయ్యాయి.. వివిధ దశల్లో నిర్మాణాల్లో ఉన్నవి ఎన్ని.. తదితర వివరాలపై అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, మండలానికి 2251 ఇళ్లు మంజూరు కాగా.. ఇంకా 950 మంది నిర్మాణాలు ప్రారంభించలేదని చెప్పారు. సమావేశంలో ఎంపీడీఓ కార్యాలయ ఏఓ డీవీ అప్పారావు, సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ఆర్‌బీకేల ద్వారా రాయితీ విత్తనాలు



విత్తనాలు అందుకున్న రైతులతో ప్రజాప్రతినిధులు

బాడంగి: మండలంలోని కోడూరు రైతుభరోసా కేంద్రంలో రైతులకు రాయితీపై విత్తనాలు శుక్రవారం పంపిణీ చేశారు. ఎంపీపీ భోగి గౌరి, జెడ్పీటీసీ సభ్యుడు పెద్దింటి రామారావు, ఉప సర్పంచ్ రెడ్డి కృష్ణ రైతులకు వరి, కంది విత్తనాలు అందజేవారు. ఏఓ కె. శిరీష ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీపీ, జెడ్పీటీసీలు మాట్లాడుతూ, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అన్నదాతకు అండగా ఉంటోందన్నారు. ఎరువులు, విత్తనాల కోసం గతంలో ఎన్నో పాట్లు పడ్డారన్నారు. ఇకపై గ్రామంలోనే తీసుకునే వెసులుబాటును ప్రభుత్వం కల్పించిందని చెప్పారు. 50 శాతం రాయితీపై వరి, శతశాతం రాయితీపై కంది విత్తనాలు సరఫరా చేస్తున్నట్టు ఏఓ శిరీష తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ సలహాదారు తెంటు మధుసూదనరావు, సర్పంచ్ భోగి జ్యోతి, జేసీఎస్ మండల కన్వీనర్ మరిపి శంకరరావు, వీఏఏ దాసిర పాప, కిశోర్, రైతులు పాల్గొన్నారు.

అన్నదాతకు ప్రోత్సాహం

● ఏపీఎంఐపీ పీడీ పీఎన్ లక్ష్మీనారాయణ



బిందుసేద్యం పరికరాలు పరిశీలిస్తున్న ఏపీఎంఐపీ పీడీ పీఎన్ లక్ష్మీనారాయణ

రామభద్రపురం: తక్కువ పెట్టుబడితో ఎక్కువ దిగుబడి సాధించేలా అన్నదాతకు అన్నివిధాలా ప్రోత్సాహం అందిస్తున్నామని ఏపీఎంఐపీ పీడీ పీఎన్ లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని ఇట్లామామిడిపల్లిలో రాయితీపై ఏర్పాటు చేసిన బిందుసేద్యం పరికరాలను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లా వ్యాప్తంగా సుమారు మూడు వేల ఎకరాలలో బిందు, తుంపర సేద్యం చేయించడమే తమ లక్ష్యమన్నారు. చిన్న, సన్నకారు రైతులకు రాయితీపై పరికరాలను అందజేస్తున్నామని, ఆసక్తి ఉన్న రైతులు సమీపంలోని ఆర్‌బీకేల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మండల ఉద్యానశాఖాధికారి మోహనకృష్ణ, వీహెచ్, వీఏఏలు పాల్గొన్నారు.

బిందు, తుంపర సేద్యంతో బహుళ ప్రయోజనాలు

బాడంగి: బిందు, తుంపర సేద్యం ద్వారా రైతులకు బహుళ ప్రయోజనాలు కలుగుతాయని ఏపీఎంఐడీసీ పీడీ ఎస్‌వీ.లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని ఆకులకట్ట, గొల్లాది గ్రామానికి చెందిన రైతులకు సమకూర్చిన బిందు, తుంపర సేద్య యూనిట్ల పనితీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మండలంలో ఇంతవరకు 37 మంది రైతులకు 19,34,792 రూపాయల విలువైన సూక్ష్మ సేద్య యూనిట్లను మంజూరు చేశామన్నారు. కార్యక్రమంలో వీఏఏ సతీష్, ఎంఐఏఓ శంకర్, కంపెనీ డీసీఓ రాజేష్, రైతులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో చేర్పించండి



ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలపై అవగాహన కల్పించేందుకు పయనమైన ప్రిన్సిపాల్ సుధాకర్ రెడ్డి, సిబ్బంది

వంగర: ఇంటర్మీడియట్ పాసైన విద్యార్థులను ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో చేర్పించండి అని వీరఘట్టం ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సీహెచ్ సుధాకర్ రెడ్డి కోరారు. మండలంలోని మడ్డువలస, వంగర, కొప్పరవలస గ్రామాలకు శుక్రవారం వెళ్లిన ఆయన ప్రభుత్వ విద్యాసంస్థల్లో విద్యార్థులకు కల్పిస్తున్న సదుపాయాలు, అందిస్తున్న నాణ్యమైన విద్యపై విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ సదుపాయాలను సద్వినియోగం చేసుకుని, పిల్లల బంగారు భవిష్యత్‌కు బాటలు వేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కొరటాల నారాయణరావు, అధ్యాపకులు పాల్గొన్నారు.

విత్తనాల పంపిణీ



విత్తనాలు పంపిణీ చేస్తున్న వైస్ ఎంపీపీ అచ్చెన్నాయుడు

రేగిడి: మండలంలోని చిన్నశిర్లాం, వెంకంపేట గ్రామ రైతు భరోసా కేంద్రాల వద్ద రైతులకు వైస్ ఎంపీపీ టంకాల అచ్చెన్నాయుడు చేతులమీదుగా విత్తనాలు శుక్రవారం పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రైతు సంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమని, రైతులకు అందుబాటులో విత్తనాలు, ఎరువులను ప్రభుత్వం ఉంచుతోందన్నారు. ఎంటీయూ–1121 రకం వరి విత్తనాలు 30 కిలోలు రాయితీ పోను రూ.834కు, ఎంటీయూ–7029 రకం వరి విత్తనాలు 30 కిలోలు రాయితీ పోను రూ.843కు, బీపీటీ–5204 రకం వరి విత్తనాలు 25 కిలోలు రాయితీ పోను రూ.698కు, ఎంటీయూ –1224 రకం విత్తనాలు 30 కిలోలు రాయితీ పోను రూ.819కు అందించడం జరుగుతోందని మండల వ్యవసాయాధికారి జి.మురళీకృష్ణ తెలిపారు.